సాక్షి ప్రకాశం

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



టీడీపీ ఉపసర్పంచ్ దౌర్జన్యం

టీడీపీ ఉపసర్పంచ్ శ్మశానానికి దాతలు నిర్మించిన ప్రహరీని కూల్చి తన స్థలంలోకి మట్టిరోడ్డు నిర్మించుకున్నాడు.

- 10లో..



మహిళ ఆత్మహత్యాయత్నం

తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ కుటుంబ సభ్యులతో కలిసి మార్కాపురం కోర్ట్ సెంటర్‌లో ఆత్మహత్యకు యత్నించింది.

- 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39 /26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణ సంస్థ రూడ్‌సెట్ డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ మే 19 నుంచి జూన్ 17వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని, శిక్షణ కాలంలో పూర్తి భోజన, వసతి ఉచితంగా కల్పిస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డుతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు 8309915577 అనే నంబరును సంప్రదించాలన్నారు.

22న జాబ్ మేళా

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైక్వాడ్ ఎలక్ట్రానిక్స్, అప్లయన్సెస్ ప్రైవేటు లిమిటెడ్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్సు కో లిమిటెడ్, మ్యాక్స్ ఫ్యాషన్ రిటైల్ కంపెనీలో మెషిన్ ఆపరేటర్లు, లైఫ్ ప్లానింగ్ అధికారి, కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్ తదితర పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఐటీఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియెట్, లేదా ఏదైనా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. జాబ్‌మేళా ఉదయం 10 గంటలకు ప్రారంభమై 3 గంటల వరకూ జరుగుతుందన్నారు. అర్హత ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు రూ.18 వేల నుంచి వేతనం ఉంటుందన్నారు. అదే విధంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు కూడా ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న జిల్లాకు చెందిన 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు కార్యాలయం వెబ్‌సైట్‌ను గానీ, కార్యాలయంలో గానీ 08592–281776 అనే నంబరును సంప్రదించాలన్నారు.

నేడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ

ఒంగోలు సబర్బన్: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఒంగోలు నగర కమిషనర్ కే.వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న 'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ వారం ఈ-వేస్ట్ రీసైక్లింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ ర్యాలీలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పాల్గొంటారన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు పీవీఆర్ బాలుర మున్సిపల్ హైస్కూలు నుంచి ప్రారంభమవుతుందన్నారు. కొత్త కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో ఉన్న ఆర్‌ఆర్‌ఆర్ అండ్ ఈ-వేస్ట్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం అక్కడ ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 10 గంటలకు ఈ-వేస్ట్ గురించి 24వ డివిజన్‌లోని షాదీఖానాలో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ సెక్రటరీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలెప్‌మెంట్ సురేష్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి పాల్గొంటారన్నారు.

ట్రిపుల్ ఐటీలో పండుగ రోజు పరీక్షలు

- చివరి నిముషంలో రద్దు

ఒంగోలు టౌన్: గుడ్ ఫ్రైడే రోజున ట్రిపుల్ ఐటీలో పరీక్షలు నిర్వహించడం వివాదంగా మారింది. ఈ నెల 15వ తేదీ నుంచి ట్రిపుల్ ఐటీ రెండవ సంవత్సరం విద్యార్థులకు ల్యాబ్ ఎక్స్‌టర్నల్ పరీక్షలు జరుగుతున్నాయి. రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ, స్టూడెంట్ వెల్ఫేర్ వార్డన్ అయిన శ్రీకాంత్ ప్రభుత్వ సెలవు దినమైన గుడ్ ఫ్రైడే రోజున ల్యాబ్ పరీక్ష నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్ష శనివారం నిర్వహించాల్సి ఉందని, వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవు మీద వెళ్లాలని భావించిన ఆయన ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ ఒక రోజు ముందు, ప్రభుత్వ సెలవు రోజున పరీక్షలు పెట్టారు. ఈ విషయం తెలిసిన ఒక విద్యార్థి నాయకుడు ట్రిపుల్ ఐటీ డైరక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు హడావుడిగా పరీక్ష రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు జరుగుతాయని ప్రకటించారు.

తెరవెనుక ఉపాధి



- సెలవురోజు డిప్యుటేషన్లపై ఉత్తర్వులు
- విస్తుపోతున్న ఉద్యోగులు
- భారీగా పైరవీలు జరిగాయన్న ఆరోపణలు
- సోషల్ ఆడిట్లలో వెలుగు చూస్తున్న భారీ అక్రమాలు
- ఆడిట్ నిర్వహించకుండా ఉండేందుకు చేతులు మారిన నగదు
- పీఆర్ పనుల పెండింగ్ బిల్లులు రూ.125 కోట్ల క్లియరెన్స్‌లో అక్రమాలు
- పైనుంచి కింది స్థాయి సిబ్బంది వరకూ ఏటీఎంగా మారిన ఉపాధి హామీ పథకం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో ఉపాధి హామీ పథకం అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కోట్లాది రూపాయల పనులు జరుగుతుండటంతో అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. డ్వామాలో క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి వరకూ ఎవరికి వారు రెండు చేతులా సంపాదిస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఇష్టమొచ్చినట్లు కొందరు ఉద్యోగులకు డిప్యుటేషన్లు ఇచ్చారు. అవినీతి ఆరోపణలు ఉన్నవారికి సైతం కోరుకున్న చోట పోస్టింగులివ్వడం, ఏడాది పూర్తి కాని ఉద్యోగులను సైతం బదిలీపై పంపించడం వంటివి చోటుచేసుకోవడం గమనార్హం.

ఉపాధిలో అంతులేని అక్రమాలు...

సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న మండలాల్లో భారీ ఎత్తున అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. అయితే, సోషల్ ఆడిట్ నిర్వహించే విషయంలో తెరవెనుక లాలూచీ జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరుగుమల్లి మండలంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు నగదు ముట్టజెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. కొండపిలో ఎక్కువ మొత్తంలో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. సోషల్ ఆడిట్ నిర్వహించకుండా నిబంధనలకు వ్యతిరేకంగా లోకల్ ఎంక్వయిరీకి ఆదేశించినట్లు సమాచారం. నిజానికి కొండపి ఏపీఓను కూడా సస్పెండ్ చేయాల్సి ఉంటుందని తెలిసింది. ఈ విషయంపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. యర్రగొండపాలెం ఏపీఓపైనా అనేక ఫిర్యాదులు వచ్చాయని, అక్కడి ఏపీడీ విచారణ చేసి పీడీకి నివేదిక అందజేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. యర్రగొండపాలెంలో మార్చి 22వ తేదీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ముందుగా ప్రకటించినా 15 రోజులు ఆలస్యంగా నిర్వహించడంపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. పీడీ వద్ద సీసీగా పనిచేస్తున్న వ్యక్తి కంప్యూటర్ ఆపరేటర్ అని, ఏడేళ్లుగా అక్కడే పనిచేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన బదిలీల్లో ఆయనను పొదిలికి బదిలీ చేస్తే ఒక్క రోజు కూడా డ్యూటీ చేయకుండానే తిరిగి ఒంగోలు వచ్చేయడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక జిల్లాలో పీఆర్ పనులకు సంబంధించి రూ.125 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని, దాన్ని క్లియర్ చేసే విషయంలో పెద్ద ఎత్తున నగదు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆ 12 చెక్కుల సంగతి తేలకుండానే...

క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించే పేరుతో కోర్సు డైరెక్టర్ లలితకుమారికి తెలియకుండా ఆమె వద్ద పనిచేస్తున్న అటెండర్ 12 చెక్కుల మీద ఫోర్జరీ సంతకాలు చేసి రూ.14 లక్షలను బ్యాంకుల నుంచి డ్రా చేసినట్లు ఫిర్యాదులొచ్చాయి. ఈ విషయంపై పీడీ జోసఫ్ కుమార్ విచారణకు ఆదేశించారు. ఆ విచారణ ఇంకా పూర్తి కాలేదు. కానీ, సస్పెండ్ చేసిన అటెండర్‌కు మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ఎవరైనా ఒక వ్యక్తి ఒకటీ రెండు చెక్కుల మీద ఫోర్జరీ చేయగలరు. ఏకంగా పన్నెండు చెక్కుల మీద ఏమాత్రం తేడా లేకుండా ఫోర్జరీ సంతకాలు చేయడం సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందని సిబ్బంది అంటున్నారు. ఇదిలా ఉండగా కోర్సు డైరెక్టర్‌గా ఉన్న ఆమెకు పదోన్నతి కల్పిస్తూ ఇన్‌చార్జి ఏపీడీగా నియమించడంపై తెరవెనుక రాజకీయ పైరవీలు, పెద్ద ఎత్తున లావాదేవీలు జరిగినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఆ పది మంది డిప్యుటేషన్ల సంగతేంటి..?

గతంలో డిప్యుటేషన్లు పొందిన 40 మంది సిబ్బంది మీద శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా త్రిసభ్య కమిటీ ఆదేశించింది. ఇప్పటికీ రెండు నెలలవుతున్నా వారి మీద ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బు ముట్టడమే కారణమని సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. మద్దిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఒక ఉద్యోగిని ఏపీడీగా డిప్యుటేషన్ మీద తీసుకొచ్చినట్లు గతంలో ఆరోపణలున్నాయి. ఇప్పుడాయన డిప్యుటేషన్ రద్దు చేశారు. ఇదొక్కటి తప్పించి మరెవరి మీదా పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. మొత్తం 49 మంది డిప్యుటేషన్ల మీద రాగా, వారిలో 10 మంది ప్రస్తుత పీడీ హయాంలో వచ్చిన వారే ఉన్నారని సమాచారం. గత పీడీ ఐదేళ్లలో 35 మందికి డిప్యుటేషన్లు వేస్తే.. కేవలం 5 నెలల కాలంలో ప్రస్తుత పీడీ 79 మందికి డిప్యుటేషన్లు వేశారని తెలిసింది.

ఉపాధి హామీ పథకం అధికార పార్టీ నేతలు, అధికారులకు ఏటీఎంగా మారింది. ఈ పనులను పర్యవేక్షించాల్సిన డ్వామా అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సంస్థలో డిప్యుటేషన్లు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయన్న విమర్శలున్నాయి. ఈ విషయంలో పెద్ద ఎత్తున రాజకీయ పైరవీలు, నగదు లావాదేవీలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. సెలవురోజు 79 మందికి డిప్యుటేషన్ ఆర్డర్లు ఇవ్వడం గమనార్హం. పీఆర్ పనుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌లోనూ తెరవెనుక లావాదేవీలు జరిగినట్టు సమాచారం.

సెలవు రోజు డిప్యుటేషన్ల ఉత్తర్వులు..!


డ్వామాలో పనిచేస్తున్న పలువురు ఏపీఓలు, ఈసీ, టీఏ, జేఈ, సీఓలను డిప్యుటేషన్ మీద బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. అయినా హడావిడిగా సెలవు రోజు డిప్యుటేషన్ల ఉత్తర్వులు ఇవ్వడంపై ఉద్యోగులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏడుగురు ఏపీఓలు, నలుగురు ఈసీలు, 25 మంది టీఏలు, నలుగురు జేఈలు, ఒక ఎంటీసీ, 18 మంది సీఓలు, 20 మంది సీఓ అండ్ ఏఏలను కలుపుకుని ఏకంగా 79 మందిని బదిలీ చేయడంపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మార్చి 19వ తేదీ కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో బదిలీలు జరిగాయి. మళ్లీ ఇప్పుడు డిప్యుటేషన్లు ఇవ్వడం నిబంధనలకు వ్యతిరేకమని ఉద్యోగులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన కౌన్సెలింగ్‌లో పామూరు వెళ్లిన ఉద్యోగిని ఇప్పుడు సింగరాయకొండకు డిప్యుటేషన్ వేసి నిబంధనలకు విరుద్ధంగా పామూరులో టీఏను ఇన్‌చార్జిగా నియమించారని, ఇది కమిషనర్ ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని అంటున్నారు. జిల్లాలో ఎక్కువ ఉపాధి హామీ కూలీలున్న కొనకనమిట్ల ఈసీని అతి తక్కువ కూలీలు ఉన్న సంతనూతలపాడుకు డిప్యుటేషన్ మీద వేశారని, కొనకనమిట్లలో ఒక టీఏకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం కూడా నిబంధనలకు వ్యతిరేకమని అంటున్నారు. సంతనూతలపాడులో ఒక టీఏని తీసుకెళ్లి ఏకంగా డిప్యుటేషన్‌పై డ్వామాలో పోస్టింగు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే సింగరాయకొండలో పనిచేస్తున్న ఒక ఈసీకి గతంలో పోస్టు లేకపోయినా ఒంగోలులో పోస్టింగు ఇచ్చారని, తాజాగా ఇప్పుడు డిప్యుటేషన్ మీద డ్వామాకు పంపించారని చెబుతున్నారు.

పరిపాలనాపరమైన సౌలభ్యం కోసమే డిప్యుటేషన్లు

పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం మాత్రమే డిప్యుటేషన్లు ఇచ్చాం. నిబంధనలను ఉల్లంఘించలేదు. పీఆర్ పనుల్లో చెక్ మేనేజ్‌మెంట్‌ను ఇంజినీరింగ్ వాళ్లు చేస్తుంటారు. డబ్బులను ఎంపీడీఓ విడుదల చేస్తారు. దాంతో మాకు ఎలాంటి సంబంధం లేదు. ఫోర్జరీ కేసుల విచారణ పూర్తయితే తగిన చర్యలు తీసుకుంటాం. కొందరు వ్యక్తులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు.

– జోసఫ్ కుమార్, డ్వామా పీడీ

పొన్న వాహనంపై చెన్నకేశవుడు



పొన్న వాహనంపై చెన్నకేశవ స్వామి వారు



స్వామివారి నగరోత్సవానికి హాజరైన భక్తులు

- చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు
- నగరోత్సవంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మార్కాపురం టౌన్: స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామికి వివిధ వాహన సేవలు నిర్వహిస్తున్నారు. చెన్నకేశవ స్వామి వారు మురళీకృష్ణ అలంకారంలో పొన్న వాహనంపై శుక్రవారం ఉదయం భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నకేశవ స్వామివారికి పుష్పాలంకారం, అర్చన, నివేదన, మంగళహారతి కార్యక్రమాలు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం నిర్వహించింది. అనంతరం స్వామి వారిని నాలుగు మాడ వీధుల్లో నగరోత్సవం చేశారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలి రావడంతో ప్రధాన వీధులు ప్రజలు, భక్తులతో నిండిపోయాయి. ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించగా పలువురు ప్రముఖులు, అధికారులు, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. డప్పు వాయిద్యాలు, వేషధారణలతో నగరోత్సవం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.



స్వామివారి నగరోత్సవం ముందు కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు



మహిమాన్వితుడా.. లోక రక్షకుడా

పాప పంకిలమైన జగత్తును తన పరిశుద్ధాత్మతో సంస్కరించేందుకు ఏసుక్రీస్తు శిలువపై రక్తం చిందించి తుదిశ్వాస విడిచిన గుడ్‌ఫ్రైడేని జిల్లాలో క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శిలువపై కడసారి క్రీస్తు పలికిన ఏడు మాటలను క్రైస్తవ విశ్వాసులు స్మరించుకున్నారు. శిలువపై క్రీస్తు ప్రతిమలను ఊరేగించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- 10లో



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న చెంచులు

ఇళ్ల స్థలాల కోసం చెంచుల ధర్నా

అర్ధవీడు: మండలంలోని చీమలేటిపల్లి చెంచులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్ధవీడు నుంచి కంభం వెళ్లే రోడ్డుపై ధర్నా చేసిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. చెంచు కులం వారికి ఇంటి స్థలాలు కేటాయించి, గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై సుదర్శన్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం

మార్కాపురం: స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జాతీయ స్థాయి ఎడ్ల పోటీలను ఎస్‌వీకేపీ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈపోటీలు రెండు రోజులపాటు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శుక్రవారం జరిగిన ఎడ్ల పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పది జతలకు పైగా ఎడ్లు వచ్చాయి. ఒంగోలు జాతి ఎడ్ల పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరుకు చెందిన ఎ శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి, ఆళ్లగడ్డకు చెందిన జీ నరసింహారెడ్డిల ఎడ్ల జత 4760.10 అడుగులు లాగి రూ.60 వేల బహుమతిని సాధించుకుంది. ద్వితీయ బహుమతిని నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బీ నారాయణరెడ్డి ఎడ్ల జత, బేస్తవారిపేట ఎంపీపీ వేగినాటి ఓసురారెడ్డి ఎడ్ల జత 4750 అడుగులు లాగి రూ.35 వేల నగదు బహుమతి సాధించాయి. ఇంకా వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన వెంకట సాయి భవిత్ రెడ్డి, రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన పూజిత రెడ్డి ఎడ్ల జతలు కూడా బహుమతులు గెలుచుకున్నాయి. పోటీలను తిలకించేందుకు మార్కాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని, క్రైస్తవులంతా ఆయన మార్గంలో నడుచుకోవాలని పాస్టర్లు పిలుపునిచ్చారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శిలువ యాత్రలు నిర్వహించగా, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

– సాక్షి, ఒంగోలు





ఒంగోలులోని పునీత చినథెరెసమ్మ చర్చి వద్ద శిలువపై ఉన్న క్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్, పాల్గొన్న క్రైస్తవులు



మద్దిపాడులోని విలియం కేరీ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెబ్బవరపు అబ్రహం



మార్కాపురం : తెలుగు బాప్టిస్టు చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఒంగోలు పునీత చినథెరెసమ్మ చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్రలో భారీగా పాల్గొన్న క్రైస్తవులు



హనుమంతునిపాడు : శిలువ యాత్ర నిర్వహిస్తున్న పాస్టర్, క్రైస్తవులు



బేస్తవారిపేట అంబేడ్కర్ కాలనీ నుంచి జంక్షన్ వరకు శిలువ యాత్ర నిర్వహిస్తున్న బిలీవర్స్ ఈస్ట్రన్ చర్చి ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య, క్రైస్తవులు



కొండపి : షాలేము ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు





ఒంగోలు జేఎంబీ చర్చిలో క్రీస్తు సందేశం అందజేస్తున్న పాస్టర్ అగస్టీన్, హాజరైన క్రైస్తవులు



ఒంగోలు జేఎంబీ చర్చిలో క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న క్వాయర్ బృందం

టీడీపీ ఉప సర్పంచ్ దౌర్జన్యం

- శ్మశాన ప్రహరీ కూల్చివేసి తన స్థలంలోకి మట్టి రోడ్డు నిర్మాణం
- పార్టీ అధికారంలో ఉందని అహంకారంతో వ్యవహరిస్తున్నాడంటూ విమర్శలు
- పట్టించుకోని అధికారులు



శ్మశానానికి నిర్మించిన ప్రహరీ



ప్రహరీ కూల్చివేసి ఉప సర్పంచ్ నారిపెద్ది రామ్మూర్తి నిర్మించిన మట్టి రోడ్డు

తాళ్లూరు: అధికార పార్టీ అనే అహంకారంతో టీడీపీకి చెందిన ఓ ఉపసర్పంచ్ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. శ్మశానానికి దాతలు నిర్మించిన ప్రహరీని కూల్చివేసి తన స్థలంలోకి మట్టి రోడ్డు నిర్మించుకున్నాడు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఆ గ్రామస్తులు తీవ్రస్థాయిలో తప్పుబడుతున్నారు. తాళ్లూరు మండలంలోని శివరాంపురంలో చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాల్లోకెళ్తే.. శివరామపురం గ్రామం నుంచి ఉమ్మనేనిపాలెం వెళ్లే మార్గంలో సర్వే నంబర్ 70/16లో 1.08 ఎకరాల్లో హిందూ శ్మశానం ఉంది. ఆ శ్మశాన స్థలాన్ని అనుకుని టీడీపీ నాయకుడైన శివరామపురం ఉపసర్పంచ్ నారిపెద్ది రామ్మూర్తికి చెందిన స్థలం ఉంది. శ్మశానాల అభివృద్ధికి పంచాయతీ కేటాయించిన నిధులతో పాటు దాతల సహకారంతో శ్మశానానికి చుట్టూ ప్రహరీ నిర్మించారు. అయితే, నారిపెద్ది రామ్మూర్తి తన స్థలంలోకి వెళ్లేందుకు శ్మశాన ప్రహరీని 15 అడుగుల మేరకు కూల్చివేసి మట్టిరోడ్డు నిర్మించాడు. టీడీపీ అధికారంలో ఉందనే అహంకారంతో రోడ్డు నిర్మాణానికి శ్మశాన స్థలాన్ని సైతం ఆక్రమించాడు.

శ్మశాన స్థలంలో 20 సెంట్లు ఆక్రమణ...

శ్మశాన స్థలం పూర్తిగా ముళ్లచెట్లతో నిండిపోయి ఉండటంతో శివరామపురం గ్రామానికి చెందిన ఆలోకం సూర్యనారాయణ గ్రామ పంచాయతీ నిధులు, దాతల సహకారంతో శుభ్రం చేయించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఈ శ్మశాన వాటికలో గ్రామానికి చెందిన 14 కులాల వారు దహన సంస్కారాలు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉందని, ఏం చేసినా అడిగేవారెవరనే అహంకారంతో ఆ గ్రామ ఉపసర్పంచ్ నారిపెద్ది రామ్మూర్తి శ్మశాన స్థలంలో 20 సెంట్లు ఆక్రమించాడు. ఆక్రమణల చెర నుంచి శ్మశానాన్ని కాపాడాలని సూర్యానారాయణ అనేకసార్లు జిల్లా అధికారులను గ్రీవెన్స్‌సెల్లో కలిసి అర్జీలు అందజేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆ ఉపసర్పంచ్ మరింత రెచ్చిపోయి తన స్థలంలోకి వెళ్లేందుకు బాట లేదంటూ.. ఆ శ్మశాన స్థలంలో నుంచే బాట వేసేందుకు గ్రామ పంచాయతీ తీర్మానం ఇచ్చిందంటూ దౌర్జన్యంగా శ్మశాన ప్రహరీని 15 అడుగుల మేర కూల్చివేసి మట్టిరోడ్డు నిర్మించాడు. అధికార పార్టీ నాయకుడినంటూ రామ్మూర్తి బెదిరిస్తుండటంతో అతని తీరును గ్రామస్తులు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం ఉపసర్పంచ్ తీరును తప్పుబడుతూ గుసగుసలాడుకుంటున్నారు. శ్మశాన స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా లక్షల రూపాయలు వెచ్చించి శ్మశానానికి నిర్మించిన ప్రహరీని కూల్చివేయడం, తన స్థలంలోకి వెళ్లేందుకు రోడ్డు నిర్మించడంపై అధికారులు స్పందించి రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. శ్మశాన స్థలానికి తిరిగి ప్రహరీ నిర్మించేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అధికార పార్టీ ఉపసర్పంచికి అధికారులు కొమ్ముకాస్తారో.. లేకుంటే గ్రామస్తులకు న్యాయం చేస్తారో వేచి చూడాలి మరి.

కోర్టు సెంటర్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం



పోలీసుస్టేషన్ వద్ద ఉన్న అంజలీబాయి, నారాయణసింగ్

మార్కాపురం: తనకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఓ మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి మార్కాపురం కోర్టు సెంటర్‌కు వచ్చి పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు వెంటనే ఆమె చేతిలో నుంచి పెట్రోలు బాటిల్ లాక్కుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. బాధితురాలు అంజలీబాయి, నారాయణసింగ్ దంపతులు మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో నివాసం ఉంటుండగా, వారికి, వారి కుటుంబ సభ్యులకు పట్టణంలోని గొర్లగడ్డలో ఖాళీ స్థలం ఉంది. దానిని అక్కడుండే కొంతమందికి గేదెలు కట్టేసేందుకు అద్దెకిచ్చారు. కొంతకాలంగా అద్దె చెల్లించకపోగా, అడిగితే దాడి చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు.

ఆది జాంబవంతుడి విగ్రహానికి భూమి పూజ

- పర్యవేక్షించిన శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి



జాంబవంతుడి విగ్రహానికి భూమి పూజ చేస్తున్న శివస్వామి, తదితరులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిలో 32 అడుగుల ఎత్తయిన ఆది జాంబవంతుడి విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఆది జాంబవ సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి శైవ క్షేత్ర పీఠాధిపతి శ్రీ శివస్వామి హాజరై భూమి పూజ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. హిందూ బంధువుల కోలాహలం మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి మదన్‌గుప్తా, తెలంగాణ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు శృతి, తదితర నాయకులు హాజరయ్యారు. సృష్టి మూలవాస్ అయినటువంటి ఆది జాంబవ చరిత్రను ప్రస్తుత సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని జాంబవ సేవా సంఘ అధ్యక్షుడు దారివేముల శ్రీనివాసులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు తంగిరాల శ్రీరామ్‌రెడ్డి, నరసింహులు, వాసిరెడ్డి హరికృష్ణ, తంగిరాల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్



గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న శాంతారావు, ఎస్‌ఆర్‌కే ఫ్రెండ్స్ యూత్ ఫోర్స్ సభ్యులు

అల్లూరు (కొత్తపట్నం): వైఎస్సార్ సీపీ, వైఎస్సార్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ప్రోత్సాహంతో కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో ఈ నెల 20వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్‌ఆర్‌కే ఫ్రెండ్స్ యూత్ ఫోర్స్ కమిటీ సభ్యులు తెలిపారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఎస్‌ఆర్‌కే ఫ్రెండ్స్ యూత్ ఫోర్స్ కమిటీ సభ్యులు టోర్నమెంట్ నిర్వహించే గ్రౌండ్‌లో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30 వేలను వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, రెండో బహుమతిగా రూ.20 వేలను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మూడో బహుమతిగా రూ.15 వేలను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, అల్లూరు ఉప సర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, నాలుగో బహుమతిగా రూ.10 వేలను వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా రూ.5,116ను ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంబటి వెంకటేశ్వర్లు అందజేయనున్నట్లు వివరించారు. మరో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా రూ.5,116 కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. టెన్నిస్‌బాల్‌తో మ్యాచ్‌లు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలకు 9502474302, 7675849703, 9618342119 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పట్టణ నిరాశ్రయుల కేంద్రాల పరిశీలన



పట్టణ నిరాశ్రయుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెప్మా పీడీ శ్రీహరి

ఒంగోలు సబర్బన్: మెప్మా ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల కేంద్రాలను మెప్మా పీడీ శ్రీహరి శుక్రవారం పరిశీలించారు. తొలుత రిమ్స్ ప్రాంగణంలో యాచకులైన స్త్రీపురుషులు, పిల్లలు ఉండే నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు. యాచకులు, నిరాశ్రయులు సేదతీరడానికి వీలుగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రిమ్స్ హాస్పిటల్ ఆవరణలో ఒకటి, ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో మరొకటి చొప్పున పట్టణ నిరాశ్రయుల కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత నెలలో సంచార యాచకులపై సర్వే చేసి సదరు రిపోర్టు ఆధారంగా యాచకులంతా పట్టణ వసతి గృహాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో నిరాశ్రయుల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, నిరాశ్రయులకు తగిన వసతి సదుపాయాలు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున డీహైడ్రేషన్ చెందకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీరు అందించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. పీడీ వెంట సంతోష్ కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ పోల్ పైనుంచి పడి ఎలక్ట్రీషియన్ మృతి



మృతుడు నెహేమియా

అద్దంకి రూరల్: విద్యుత్ పోల్ పైనుంచి కిందపడి ఎలక్ట్రీషియన్ మృతిచెందిన సంఘటన అద్దంకి మండలంలోని చినకొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి భార్య పులి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై రవితేజ కేసు నమోదు చేశారు. ఆ వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన పులి నెహేమియా (35) సుమారు 15 సంవత్సరాలుగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రామాంజనేయులు రైస్ మిల్లుకు కరెంట్ రాకపోవడంతో చూడటానికి వెళ్లి విద్యుత్ పోల్ ఎక్కాడు. తీగలను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్ తగిలి పోల్ పైనుంచి కిందపడ్డాడు. స్థానికులు రామాంజనేయులు, తంగిరాల మనోహర్ వెంటనే అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు నెహేమియాను తరలించారు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.